పత్రికా ప్రకటన - 2

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 24.07.2014

అసలైన లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా గ్రామ స్థాయిలో ఆర్థిక, సామాజిక స్థితిగతులపై సమగ్ర సర్వే నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు.

అపార్డ్‌లో ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, ప్రభుత్వ సలహాదారులు బివి.పాపారావు, ఎకె.గోయల్, సీనియర్ ఐఎఎస్ అధికారులు నర్సింగ్ రావు, బిపి.అచార్య, పార్థసారథి, రేమాండ్ పీటర్, బూర వెంకటేశం, అనిల్ కుమార్, సిఎంఓ అధికారులు, భూపాల్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఇంటలిజెన్స్ ఐజి శశిధర్ రెడ్డి తదితరులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా, అవినీతి రహితంగా వుండాలని, ఇందుకోసం విస్తృత ప్రచారం, ప్రజల భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చెప్పారు. గృహనిర్మాణ పథకం, పెన్షన్లు, రేషన్ కార్డుల పంపిణీ లాంటి పథకాలలో చాలా అవినీతి జరిగిందని, అసలైన లబ్దిదారులకు అన్యాయం జరిగిందని సిఎం అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి పద్దతి కొనసాగడానికి వీలు లేదని చెప్పారు. ఎవరు నిజంగా పేదవారో, ఎవరు ఏలావున్నారు, ఎవరి పరిస్థితి ఏమిటి, ఎవరికి ఏలా ంటి సహాయం కావాలి అనే విషయాలను మరో సారి నిర్దారించుకోవాల్సి వుందన్నారు. అందుకే తెలంగాణ వ్యాప్తంగా ఆగష్టు నెలలో సమగ్ర, ఆర్థిక, సామాజిక సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. మధ్యవర్తులు, పైరవీ కారుల ప్రమేయం లేకుండా ఈ సర్వే నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలపై బాగా ప్రచారం చేయాలని కూడా నిర్ణయించారు. కళ్యాణలక్ష్మి లాంటి పథకాలలో ప్రభుత్వం ఇచ్చే 50 వేలు నేరుగా పేదలకు చేరుతాయని, అన్నిపథకాలు అలాగే వుండాలని చెప్పారు. దీనివల్ల అవినీతికి ఆస్కారం వుండదని వివరించారు. తెలంగాణలో 80 శాతం మంది బలహీన వర్గాల వారు వున్నారు. వారి జీవన ప్రమాణాలు పెంచే విధంగా కార్యక్రమాలు వుండాలని చెప్పారు. ఇప్పటివరకు ప్రభుత్వం దగ్గర ఖచ్చితమైన వివరాలు కూడా లేవని, అందుకోసమే తెలంగాణలో సర్వే చేయాలని చెప్పారు. కుటుంబానికి చెందిన ప్రతి వ్యక్తి గురించిన సమాచారం సేకరించాలని సూచించారు. దీనివల్ల ఏ వ్యక్తికి ఏలాంటి అవసరం వుందో తెలుతుందని, అప్పుడు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలల్లో లబ్దిదారుల ఎంపిక సులభం అవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. సమగ్ర సర్వే సందర్భంగా ఎవరి వివరాలు వారే చెప్పుకోవాలని, ఎవరి తలరాతలు వారే రాసుకోవాలని చెప్పారు. ప్రభుత్వమే గడపగడపకు వెళ్లి వివరాలు సేకరిస్తుందని వివరించారు. సర్వే పూర్తయిన తరువాత అభివృద్ది చెందిన దేశాల తరహాలో మల్టిపర్పస్ హౌస్ హోల్డ్ కార్డుల మాదిరిగా, పాస్ పోర్టు తరహాలో తెలంగాణ సిటిజన్ కార్డులిస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాలు ఎట్టి పరిస్థితుల్లో అరుహులకే అందాలని, అక్రమార్కులకు ఏ మాత్రం తావులేకుండా చేయాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో అవినీతి అక్రమాలకు తావుండదని, భోగస్ లబ్దిదారులు వుండరని సిఎం స్పష్టం చేశారు. దసరా దీపావలి మధ్య కాలంలో రేషన్ కార్డుల పంపిణీ వుంటుందని సిఎం చెప్పారు.

---

సిపిఆర్ఓ టు సిఎం.